క్లుప్తంగా

ఉద్యమ నాయకుడి నిరవధిక నిరాహార దీక్ష



మడికొండ: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ నాయకుడు వల్లెపు శ్రీనివాస్ (బాషా) డిమాండ్ చేస్తూ గురువారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈమేరకు మడికొండలోని అమరవీరుల స్తూపం వద్ద చేపట్టిన దీక్షను కాంగ్రెస్ కాజీపేట మండల అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్ ప్రారంభించారు. శ్రీనివాస్ దీక్షకు వడ్డెర సంఘం నాయకులు ఓర్సు యాకయ్య, మక్కల నర్సింగరావు, రాము, బీఎస్పీ నాయకులు బోసు రాజేశ్వరి, వడ్డెర సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

దేవన్నకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎకనామిక్స్ విభాగంలో పరిశోధకుడు సిల్వర్ దేవన్నకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సోషియో ఎకనామిక్స్ అండ్ హెల్త్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్రిమిటివ్ ట్రైబ్స్ ఏ స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సిల్వర్ దేవన్నకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ సురేష్‌లాల్ పర్యవేక్షణలో దేవన్న తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

రాజీవ్ విగ్రహానికి పాలాభిషేకం



రామన్నపేట: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదంపై మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు వరంగల్‌లోని ఎంజీఎం సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి గురువారం పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1989లోనే మహిళా రిజర్వేషన్‌కు రాజీవ్ బీజం వేశారన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి



విద్యారణ్యపురి: విద్యార్థులు డిజిటల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని హనుమకొండలోని కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి కోరారు. కళాశాలలో డిజిటల్ మెంటరింగ్‌పై గురువారం ఒకరోజు వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కృత్రిమ మేధతో మనిషి జీవితం పూర్తిగా సాంకేతికమయమై పోయిందని చెప్పారు. సైబర్ ప్రపంచంలో కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. టాస్క్ నుంచి విచ్చేసిన ప్రత్యేక శిక్షకురాలు శ్వేత మాట్లాడుతూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాయంతో సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కేడీసీ మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ డాక్టర్ ఇందిరాదేవి, టీఎస్‌కేసీ సమన్వయ కర్త లింగారెడ్డి, ఫుల్‌టైం మెంటార్ సాగర్ పాల్గొన్నారు.

మెస్‌కార్డులు రెన్యూవల్ చేయాలి

కేయూ క్యాంపస్: మెస్ బకాయిలు చెల్లించే స్థితిలో విద్యార్థులు లేరని, ఈక్రమంలో బకాయిలు చెల్లించకున్నా విద్యార్థుల మెస్ కార్డులను రెన్యూవల్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిశ్రీన్ సుల్తానా, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ పూర్తి మెస్ బకాయిలు చెల్లిస్తేనే మెస్‌కార్డులు జారీ చేస్తామని యూనివర్సిటీ అధికారులు ఆదేశాలు జారీచేయటం శోచనీయమన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు వరుణ్, సందీప్, రాజకుమార్, ప్రవళిక, అనూష పాల్గొన్నారు.

బాధితులకు అండగా 'సఖి'



నయీంనగర్: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్‌స్టాప్ సేవలను బాధిత మహిళలు, బాలికలు ఉపయోగించుకోవాలని సెంటర్ కేస్ వర్కర్ వినీల తెలిపారు. హనుమకొండ కొత్తూరు జెండా కమ్యూనిటీ హాల్‌లో మహిళలకు సఖి సేవలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ బాధిత మహిళలు 0870 – 2452112 లేదా టోల్ ఫ్రీ 181 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, మెప్మా సీఓ సునీల్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన మంత్రి పదవిని త్యాగం చేయడంతో పాటు రాష్ట్రం ఏర్పాటయ్యే వరకు ఎలాంటి పదవి స్వీకరించబోనని చెప్పి మాటకు కట్టుబడి ఉన్న మహా నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు కొనియాడారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు నగరవ్యాప్తంగా పలువురు గురువారం నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేయర్, తదితరులు



గోపాలస్వామి గుడి జంక్షన్‌లో లక్ష్మణ్‌బాపూజీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నేత ప్రదీప్‌రావు



కాశిబుగ్గలో నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు



బాపూజీకి నివాళి అర్పిస్తున్న హనుమాన్‌నగర్ -1 కాలనీవాసులు



శివనగర్‌లోని పోపా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



హంటర్‌రోడ్డులో మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, తదితరులు

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

- వ్యవసాయ, ఉద్యానశాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్: నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో సాధించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య వివిధ బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ, వివిధ బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాల సాధింపుపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎరువుల నిల్వ నివేదికలను పరిశీలించి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఉద్యానవన శాఖ పర్యవేక్షణలో ఆయిల్ పామ్ తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. 700 ఎకరాలకు మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 15 వరకు 125 ఎకరాల్లో రైతులను గుర్తించి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. ప్రతి 1,000 ఎకరాలకు ఒక ఫీల్డ్ ఆఫీసర్ ఉండాలని, 13 మండలాలకు 13 మంది ఉండేలా చూసుకుని శాఖాపరమైన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రాబోయే యాసంగి పంటలకు అక్టోబర్ 15వరకు రైతుల నుంచి దరఖాస్తులు, రైతు వాటాను డీడీ రూపంలో చెల్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, ఓటరు జాబితా రూపకల్పనలో వేగంపెంచాలని అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు.

ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఖిలా వరంగల్: ఓటు ఉన్న ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నోడల్ అధికారి ఈదురు అనిల్‌కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచనల మేరకు ములుగురోడ్డులోని అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రాంగణంలో జిల్లా వైద్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలకు గురువారం ఒక రోజు శిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీలోపు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

కాజీపేట: ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయంశక్తితో ఆర్థికంగా ఎదగాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని వాటర్ ట్యాంక్ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో కాకతీయ స్టీల్ బ్యాంక్‌ను గురువారం ప్రారంభించారు కార్యక్రమంలో నగర కమిషనర్ రిజ్వాన్ బాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్ సంకు నర్సింగ్, కోల రాజేష్, శ్రీనివాస్, రజితరాణి, హరిత, శారద, శోభారాణి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలి

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలో మరోసారి బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని, అందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే అరూరి రమేష్ పిలుపునిచ్చారు. 55వ డివిజన్‌కు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి గురువారం ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రజిత, సిరంగి సునీల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు అటికం రవీందర్, మణీందర్‌నాథ్ పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం



వరంగల్ : మహిళా రిజర్వేషన్ బిల్లు ఎట్టకేలకు లోకసభ ఆమోదం పొందడం హర్షణీయం. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతైనా మహిళా సాధికారత సిద్ధించే అవకాశం కలగడం మహిళా లోకానికే గొప్ప వరం. తెలంగాణ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపడం, బీఆర్‌ఎస్ నాయకురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీ వేదికగా పెద్ద నిరసనలు చేపట్టడంతోనే ఈ బిల్లు ఆమోదం పొందిందనడంలో సందేహం లేదు. చట్ట సభల్లో మూడోవంతు మహిళా నాయకుల ప్రాతినిధ్యంతో ఎంతో మంచి ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ హరిరమాదేవి, బీఆర్‌ఎస్, రాష్ట్ర నాయకురాలు

ఓబీసీ కోటా ఉండాలి



మహిళా రిజర్వేషన్ బిల్లును అందరం స్వాగతిస్తున్నాం. ఇదొక మంచి పరిణామమే. కానీ, ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు చాటున అగ్రకులాల వారు తమ ఆధిపత్యాన్ని చాటుకునే ప్రమాదం ఉన్నది. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లులో కచ్చితంగా ఓబీసీ కోటా ఉండేవిధంగా చూడాలి. లేకుంటే దొరలు పోయి దొరసానులు వస్తారు. పార్లమెంట్‌లో 181 మంది మహిళలకు ఎంపీలుగా, తెలంగాణ శాసన సభలో 39 మంది మహిళలకు ఎమ్మెల్యేలుగా అవకాశం వస్తుంది. ఓబీసీ కోటా లేకపోవడంతో ఎక్కువ శాతం అగ్రకులాల మహిళలు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది.

– వెంకట్రాజం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బిల్లు తేవడం చారిత్రకం



హన్మకొండ : 'నారీ శక్తి వందన్ అధినియం' పేరిట కేంద్రం మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం చారిత్రకం. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం ఒక శుభ పరిణామం. భారత దేశ చరిత్రలోనే ఒక మహత్తర ఘట్టం. రాజ్యసభలో కూడా ఒకసారి మహిళా బిల్లు ఆమోదం పొందింది. కానీ, ఆనాడు కాంగ్రెస్ పార్టీ.. దాని మిత్రపక్షాల స్వలాభం కోసం బిల్లును పక్కనపెట్టింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళలకు పార్లమెంట్‌లో ఎంపీలుగా, రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా అవకాశాలు రానున్నాయి. మహిళా అభివృద్ధి దిశగా ఇది మరో కీలక అడుగు. రాజ్యసభలోనూ బిల్లు ఆమోదం పొందడం హర్షనీయం.

– రావు పద్మ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

మా ప్లాట్లు మాకు ఇప్పించండి..



మాట్లాడుతున్న పూర్ణచందర్‌రావు

నయీంనగర్: తమకు ఇవ్వాల్సిన ప్లాట్లను ఇవ్వకుండా 11ఏళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు ముప్పుతిప్పలు పెడుతున్నారని, ఈక్రమంలో తమ ప్లాట్లను తమకు ఇప్పించాలని బొల్లికుంట పోరాట సమితి అధ్యక్షుడు పూర్ణచందర్ రావు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2012లో సొంతింటి కల పేరుతో ఆర్యవైశ్య (పట్టణ) మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఏర్పాటు చేసి సభ్యుల నుంచి గుండా ప్రకాశ్‌రావు రూ.20కోట్ల వరకు వసూలు చేసి బొల్లికుంట గ్రామంలో హౌసింగ్ కాలనీ పేరుతో స్థలం తీసుకొని సభ్యులకు ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేయడం లేదని వాపోయారు. బాధితులు సదాకుమార్, చంద్రశేఖర్, నాగయ్య, విమలదేవి, వీరేశలింగం, శ్రీనివాసులు, శోభ, శ్రీనివాస్ గోపాల్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు తొలి అడుగు



మాట్లాడుతున్న శ్రీధర్‌కుమార్ లోథ్

కేయూ క్యాంపస్: మహిళా సాధికారతకు తొలి అడుగు మహిళా బిల్లు అని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ అన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మహిళా బిల్లుపై బీఏ మొదటి సంవత్సరం విద్యార్థులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 27ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తరువాత లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందటంతో భారతదేశ రాజకీయాల్లో సరికొత్త చరిత్ర మొదలైనట్లుగా భావించాలని అన్నారు. ఈ బిల్లులో ఓబీసీ కోటా కూడా ఉంటే మరింత అర్థవంతంగా ఉండేదని చెప్పారు. సమన్వయకర్తగా వ్యవహరించిన డాక్టర్ తిరుణహరి శేషు మాట్లాడుతూ మార్గరేట్ థాచర్, ఇందిరాగాంధీ, ఏంజెలా మెర్కల్ లాంటి వారు చట్టసభల్లో తమదైన ముద్ర వేశారని గుర్తుచేశారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సమ్మయ్య, తదితరులు

హన్మకొండ: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ డేగ సమ్మయ్య కోరారు. ఈమేరకు హనుమకొండలోని టీఎస్‌ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ గోపాల్‌రావును డేగ సమ్మయ్యతో పాటు ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి వంగ రవీందర్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఇంజనీర్ల సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అంతకుముందు తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ టీఎస్‌ఎన్పీడీసీఎల్ శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 15 జిల్లాల నుంచి అసోసియేషన్ సభ్యులు తరలివచ్చారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, సుధాకర్, వెంకటరమణ, రామ్‌నితిన్, రాము, బాలాజీ, తరుణ్, వెంకటేష్, రాములు పాల్గొన్నారు.

రక్తదాన ఆవశ్యకతపై ప్రచారం చేయాలి



సర్టిఫికెట్ అందజేస్తున్న గోపాల్‌రావు

హన్మకొండ: రక్తదాన ఆవశ్యకతపై విస్తృత ప్రచారం చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ అతిథి గృహంలో టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్, వివిధ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో గురువారం నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల మెగా రక్తదాన శిబిరాన్ని గోపాల్ రావు ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయచందర్ రెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్వర రావు, గణపతి, సంధ్యారాణి, మోహన్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సీజీఎంలు సదర్‌లాల్, మధుసూదన్, మోహన్ రావు, కిషన్, కేఎస్.గుట్ట, ఎస్ఈలు వెంకటరమణ, వేణుమాధవ్, మధుసూదన్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టండి



వినోద్‌కుమార్ ఇంటి వద్ద బాధిత అభ్యర్థులు

హన్మకొండ: జిల్లా పరిషత్‌లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ కారుణ్య నియామకాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు హనుమకొండ కాకతీయ కాలనీలోని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపెల్లి వినోద్‌కుమార్ నివాసం వద్ద ఆయనను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2015లో జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నామని, పలు కారణాలతో తమకు ఉద్యోగాలు కల్పించలేదని వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో శిరీష, ధనలక్ష్మి, సృజన, జాస్మిన్, సుష్మ ఉన్నారు.

రాముకు స్వర్ణ కంకణధారణ

హన్మకొండ కల్చరల్: నగరానికి చెందిన భువనేశ్వరి ట్రస్ట్ చైర్మన్ మోత్కూరి రాముకు హనుమకొండలో గురువారం జరిగిన మేథోమథన సదస్సులో దర్శిని గ్రూపు చైర్మన్ వద్నాల నాగరాజు స్వర్ణ కంకరణధారణ చేశారు. కార్యక్రమంలో నరేంద్రకాప్రే, వితాల వెంకట్రామ శాస్త్రి, రాధాకృష్ణశర్మ, షణ్ముక ఘనాపాఠి, దర్శనం వెంకన్న, బ్రాహ్మణ సంఘం నాయకులు జగన్మోహన్‌శర్మ, కనకదుర్గ గ్రూప్ చైర్మన్ రాగిడి తిరుపతిరెడ్డి, రామమ్ గ్రూప్ చైర్మన్ బన్న సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఐనవోలు చైర్మన్ పదవి యాదవులకే ఇవ్వాలి

నయీంనగర్: హనుమకొండ జిల్లా ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ పదవిని యాదవులకే ఇవ్వాలని అఖిల భారత యాదవ మహాసభ వరంగల్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. హనుమకొండ కాకాజీకాలనీలో యాదవ మహాసభ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నక్క కొంరెల్లి, జిల్లా సహాయ కార్యదర్శి బైరబోయిన కోటేశ్వర్, అధికార ప్రతినిధి దేనబోయిన రవి, గొర్లకాపరి సొసైటీ వైస్ చైర్మన్ కావటి సారయ్య, రాజారపు రాజు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే పురస్కారం ప్రదానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్‌ను మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ పురస్కారంతో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో సన్మానించారు. కేయూలోని ఎకనామిక్స్ విభాగంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విష్ణువర్ధన్‌కు మెడల్, ప్రశంస పత్రంతో పాటు పురస్కారాన్ని క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, తెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలరాజు రాజ్‌కుమార్, కన్వీనర్ డాక్టర్ మోహన్‌రావు ప్రదానం చేశారు.

సంకల్ప సభను విజయవంతం చేయండి

నయీంనగర్: ముస్లింల 22 డిమాండ్ల సాధన కొరకు ఈనెల 24 వరంగల్ పోచమ్మమైదాన్ అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ముస్లిం డిక్లరేషన్ సంకల్ప సభను విజయవంతం చేయాలని తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్ జేఏసీ పిలుపునిచ్చింది. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ ఎండీ.రాజీమహ్మద్ మాట్లాడగా, రహీమ్, నవీద్ షేక్, హిసాముద్దీన్, తహసీర్, మీర్జా నదీమ్ బేగ్, హుస్సేన్ పాషా, ఖాహర్, మహమూద్‌పాషా పాల్గొన్నారు.

మెపా వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అభినాష్



ఖిలా వరంగల్: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా శివనగర్‌కు చెందిన కలకొండ అభినాష్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈమేరకు శివనగర్‌లో గురువారం జరిగిన సమావేశంలో అభినాష్‌కు మెపా రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్ నియామక పత్రం అందజేశారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పాలక సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ నూతన కమిటీని కార్పొరేషన్ ఆవరణలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుల్ల రమేష్, ప్రధాన కార్యదర్శిగా వక్కల రణసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మేకల దేవేందర్, సుద్దాల కుమార్, కోశాధికారిగా నాగుల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా లింగాల ప్రియాంక, నేరెళ్ల కుమారస్వామి, ఎర్ర అరుణ్, నేరెళ్ల అవినాష్, కొంగర అరుణ్, బరిగెల మధుకర్, లంక దాసరి రామస్వామి, కిరణ్, కార్యవర్గ సభ్యులుగా మరికొంత మందిని ఎన్నుకున్నారు.

శ్వేతార్కలో సూర్య నమస్కార పూజలు

కాజీపేట: బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో గురువారం సూర్య నమస్కార పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో సూర్యపుష్టిని పురస్కరించుకుని సూర్య భాగవానుడి చిత్రపటాన్ని చిత్రీకరించి సూర్య నమస్కారాలు చేశారు.

చాంబర్ వేడుకలకు ఆహ్వానం



వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30న నిర్వహిస్తున్న ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొనాలని అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కోరారు. ఈమేరకు మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే రాజయ్య, టీఎస్‌ఆర్‌డీసీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, రాష్ట్ర హస్తకళల చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్‌ను వేర్వేరుగా కలిసి ఆహ్వానించారు.

ఉచిత మెగా క్యాన్సర్ వైద్య శిబిరం

వరంగల్ అర్బన్: ఈనెల 20, 21తేదీల్లో రెండు రోజుల పాటు వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించినట్లు సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ అవినాష్ తిప్పని తెలిపారు. 300మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు.

ద్విచక్ర వాహనాల చోరీ నిందితుల అరెస్టు

రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీల్లో ఇద్దరు ద్విచక్రవాహనాల చోరీ నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వారి నుంచి జత బంగారు కమ్మలు, 8ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఐఐటీ టాపర్లకు సర్టిఫికెట్ల ప్రదానం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ఏకశిల స్కూల్‌లో ఐఐటీ స్కూల్ టాపర్లకు సర్టిఫికెట్లను గురువారం ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా స్కూల్ డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి హాజరై సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ లవకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యార్థి జేఏసీ దీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ప్రశ్నించి టాస్క్‌ఫోర్స్ పోలీసులతో దాడి చేయించిన వీసీ, రిజిస్ట్రార్లను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల కేయూ జేఏసీ ఆధ్వర్యంలో దూరవిద్య కేంద్రంలోని ఆవరణలో నిర్వహిస్తున్న దీక్షలు గురువారం 16వ రోజుకు చేరుకున్నాయి.

సాగు చేయకుండా అడ్డుకున్నాడు

హసన్‌పర్తి: పొలం సాగు చేయకుండా తనను అడ్డుకున్నారని వంగపహాడ్‌కు చెందిన గోనెల సమ్మయ్య తెలిపారు. ఈమేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. సాగుచేయకుండా అడ్డుకున్న రుద్రారపు శ్రీనివాస్, అతని కుమారుడు తేజపై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

గీత కార్మికుల మహాధర్నాకు తరలిరావాలి

మడికొండ: హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద శుక్రవారం నిర్వహించనున్న కల్లు గీత కార్మికుల మహాధర్నాకు గీత కార్మికులు వేలాదిగా తరలి రావాలని కాజీపేట మండల కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు రాజేందర్ గౌడ్ పిలుపునిచ్చారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

కాళోజీ సెంటర్: మానవ అక్రమ రవాణా తీరు తెన్నులు, బాలల హక్కుల గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సమితి కోఆర్డినేటర్ సుదర్శన్ అన్నారు. వరంగల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు.

26న హనుమకొండలో మిలాద్ ఉన్ నబీ

న్యూశాయంపేట: ఈనెల 26న సాయంత్రం ఈషా నమాజ్ అనంతరం హనుమకొండ జక్రియా ఫంక్షన్ హాల్‌లో మర్కజ్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో 28వ మిలాద్ ఉన్ నబీ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ బాధ్యులు మౌలానా ఖాజా జాఫరుల్లా బేగ్, ముగ్దుం మొహియొద్దీన్ తెలిపారు. ఈమేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

బాధితుడికి పరామర్శ

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ దీన్‌దయాళ్‌నగర్‌కు చెందిన గుగులోతు సురేష్.. ఇటీవల ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు బాధితుడిని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

ఖిలా వరంగల్: చిరు వ్యాపారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ బోజరాజు హెచ్చరించారు. వరంగల్ శంభునిపేట జంక్షన్‌లో గురువారం రాత్రి చిరు వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

బీఆర్‌ఎస్ వైపు యువత చూపు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయ్‌భాస్కర్

హన్మకొండ: రాష్ట్రంలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు చూసి యువత.. బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నట్లు భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. ఎన్జీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో 4వ డివిజన్‌కు చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి విజయ్‌భాస్కర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్, మారుపల్లి రాజ్‌కుమార్, నరేష్, రాజేష్, అర్జున్, చందు, ప్రమోద్, నిఖిల్, రతీష్, శంకర్, నీరజ్ పాల్గొన్నారు.